# ప్రమాదో ధీమతామపి

ఆ నాడు ఆశ్రమం అంతా కన్నుల పండుగగా, వినవేడుకగా ఉంది. ఆ సందడి, సంబరం ఇంతా అంతా కాదు.

ఎక్కడ చూసినా నేల ఈనినట్టు జనసందోహం! వేలాది భక్తులు, శిష్యులు, వేదపారాయణం చేస్తున్న పండితులు, శ్రీ లలితా సహస్రనామం చదువుతున్న సువాసినులు.

పీఠాధిపతులు ధర్మప్రచారం పూర్తిచేసుకుని, సంవత్సరం తరువాత నిన్నటిరోజున ఆశ్రమానికి తిరిగి వచ్చారు దిగ్విజయంగా.

స్వామివారు ఆశ్రమ స్వీకారం చేసిననాటి-40వ పుట్టినరోజు పండుగ ఈనాడు.

ఒకనాడు ఈ దేశానికి ప్రథమ పౌరుడు, స్వామివారి ప్రియ అంతేవాసి, ఈనాడు స్వామివారి దర్శనంకోసం రావడం.

అన్నింటికన్నా ముఖ్యమైనది. అందరూ ఉత్సాహంతో ఎదురు చూస్తున్నది బహుమతి ప్రదానం.

తమ ముఖ్యమైన భక్తుల భక్తికి మెచ్చుకుని స్వామివారు అనుగ్రహపూర్వకంగా, ఆశీర్వచనపూర్వకంగా అందరి సమక్షంలో ఇచ్చే చిరుకానుకలు.

భక్తుల దృష్టిలో నోబెల్ బహుమతి, జ్ఞానపీఠ్ పురస్కారం కంటే కూడా ఇవి మిన్న. ఇవి సాంప్రదాయకంగా, వార్షికంగా ఇచ్చే బహుమానాలు కావు. ఈ కార్యక్రమం ఒక లాంఛనం కాదు, ఒక మొక్కుబడి వ్యవహారం కాదు.

దశాబ్దానికో,పుష్కరానికో జరిగే ఈ కార్యక్రమం నాస్తికులకు కనువిప్పు!

ముముక్షువులకు ఆడబోయిన తీర్థం. కైవల్యపథం, వైరాగ్య శిఖరం! అజ్ఞాన అంధకారంలో ఉన్నవారికి ఇది విశ్వరూప సందర్శనం.

నిస్సంగులకు నిర్మోహులకు ఈ రోజు అన్నిరోజులతోపాటే, వింత లేదు, విడ్డూరం లేదు!

కానీ కొందరి మనసుల్లో ఆశలు ఉన్నాయి, అంచనాలు ఉన్నాయి,బేరీజులు ఉన్నాయి, స్వార్థం ఉంది. స్పర్థ ఉంది.

స్వామివారు చాలా ఉల్లాసంగా ఉన్నారు. ఆశ్రమవాసులను పేరుపేరునా పలకరించారు. యోగక్షేమాలు విచారించారు. కనపడనివారిని గురించి ఆరా తీశారు. కాలగర్భంలో కలిసిపోయినవారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

ఈ ఏడాదికాలంలో దివినుంచి భువికి దిగి వచ్చిన చిన్నారులకు ఆశీఃపూర్వక స్వాగతం పలికారు.

గోపూజ జరిగింది. గజ పూజ జరిగింది.నవగ్రహపూజ జరిగింది. మృత్యుంజయ జపం, ఆయుష్య హోమం జరిగాయి,.

సువాసిని పూజ జరిగింది.

వేదపండితులకు భూరి సంభావనలు లభించాయి.

సామగానంతో అష్టదిక్కులు అమృతమయ్యాయి. సభ ప్రారంభమైంది. దేశాన్ని ఒకనాడు కీర్తిప్రతిష్ఠలతో పరిపాలించిన ఆ మహావ్యక్తి వానప్రస్థుడై, సర్వసంగ పరిత్యాగియై, స్వామివారికి అంతేవాసియై వారి అనుజ్ఞతో సవినయంగా సరసన కూర్చున్నారు.

స్వామివారి అనుగ్రహభాషణం ప్రారంభమైంది. ఈ సప్తఋషి దేశంలో పెరిగిన ఆధ్యాత్మిక చింతన, జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను గురించి, ప్రమోదంతో సహర్షంగా చెప్పారు.

దేశ విదేశాలలో క్షణక్షణం పెరుగుతున్న ఆస్తిక ప్రవృత్తి,అంతరేక్షణ, మోక్షజిజ్ఞాసను గురించి చెబుతూ పరవశించిపోయారు.

కానీ ప్రేక్షకులు, శ్రోతలు ఎదురుచూస్తున్నది తమలో స్వామివారి అనుగ్రహానికి పాత్రులైనవారు ఎవరా? అని.

స్వామివారు ఒక్కసారి ప్రేక్షకులవంక చూశారు. దృష్టి మొదటివరుసలో కూర్చున్న వారిపైన-నలుగురు వ్యక్తులపైన నిలిచింది.

తమ ఆశ్రమ నిర్మాణానికి యాభైలక్షలు విరాళం ఇచ్చిన వ్యక్తి మొదటివాడు.

తను, తన సిబ్బంది చేసే విదేశ ప్రయాణాలకు అయ్యే ఖర్చు భరించే వ్యక్తి రెండవవాడు.

ఆశ్రమం వారు నిర్మించే ఆలయాలలోని విగ్రహాలు, విగ్రహ ప్రతిష్ఠలకు అయ్యే ఖర్చులు భరిస్తున్న వ్యక్తి మూడవవాడు.

స్వామివారి పుట్టినరోజున మొట్టమొదటి పూలదండ ఎవరు వెయ్యాలో నిర్ణయించే విషయంలో వేలంపాట పెట్టించి రెండు లక్షల రూపాయలకు పాటపాడి, తనకు దండ వేసిన వ్యక్తి.

అదే... ఆ దండను వేలంపాటలో నాలుగు లక్షల రూపాయలకు కొన్న వ్యక్తి నాలుగవవాడు.

వీరందరి చూపు స్వాములవారిమీదనే ఉంది. స్వామివారి ముఖంలో ఆత్మవిశ్వాసం,ధైర్యం.

వీరి ముఖంలో ఆందోళన కనిపిస్తోంది. ఆశ కనిపిస్తోంది.

స్వామివారు "కలియుగంలో ముక్తికి సులభమైన మార్గాలు సంకీర్తనం, దానం, మానవ సేవ" అని చెబుతూ "సంకీర్తనం అంటే మంచిని గురించి చెప్పడం, మంచి పనులను కీర్తించడం. అంతేగానీ ఇచ్చకాలకు, మెరమెచ్చులకు, అపాత్రులను పొగడటం సంకీర్తన కాదు.

దానం పాపపరిహారం కోసం కాదు. పుణ్య సముపార్జనకోసం కాదు. దానం మానవ ధర్మం - బాధ్యత, విధి. దానం చేసే వ్యక్తి ధర్మ ప్రవర్తనుడై ఉండాలి. దానం ఇవ్వబడే ద్రవ్యం న్యాయార్జితం కావాలి. పాపపంకిలమైనది, దోషభూయిష్టమైనది కాకూడదు. దానం

స్వీకరించే వ్యక్తికి పాత్రత ఉండాలి. యోగ్యత ఉండాలి.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవ సేవ. మానవత్వమున్న వారికి సేవ. స్వార్థపరులకి, దుర్మార్గులకి, బలవంతులకి, భయంతో,నిరాశతో, బలహీనతతో, బలహీనుడు చేసే వెట్టిచాకిరీ మానవసేవ కాదు. సాటి మానవునియందు ఉండే, సమభావన, సానుభూతి, ఆత్మీయత వీటిపైన మానవసేవ ఆధారపడి ఉండాలి. ప్రతిఫలాపేక్షతో చేసే సంకీర్తన, దానం మానవసేవ ఆత్మోన్నతికి సాధనాలు కావు. అవి వ్యాపార మార్గాలు. అహంభావ దోహదాలు. లాభం ఆశించి పెట్టుబడి పెట్టిన వ్యాపారాలు, స్వార్థసంచితాలు!'

ఈ మాటలు మృదువుగా ఉన్నా, యదార్థాలైనా కొందరికి ఈటెపోటుల్లాగా తగిలాయి.

స్వామివారి పక్కనున్న శిష్యుడితో ఏదో చెప్పారు. అతను వడివడిగా జనంలోకి వెళ్లి కొంచెం సమయం తరువాత ముగ్గురు వ్యక్తులతో తిరిగి వచ్చాడు.

రామాయణంలోని శబరిని గుర్తుకు తెచ్చే ఒక పండు ముదుసలి, భారతంలోని విదురునివంటి ఇంకొక వ్యక్తి, నాగరికత, సంప్రదాయం సమపాళ్లలో కలిసిన నడివయసులో ఉన్న ఒక పురుషుడు మూడవవాడు. ఈ ముగ్గురూ వినయంతో, భయంతో వేదికమీద నిలబడ్డారు.

స్వామివారి కనుసన్నలలోని భావాన్ని గ్రహించి ముఖ్య అతిథి వారిని దుశ్శాలువలతో సత్కరించాడు. పూలమాలలతో అలంకరించాడు. అమ్మవారి బంగారు రూపు ఇచ్చారు. కవర్లలో పెట్టిన చాలా రొక్కం ఇచ్చారు.

ప్రేక్షకులలో చాలామంది ముఖాలలో ఆశ్చర్యం. మరికొందరి ముఖాలలో ప్రశ్నల పరంపరలు.కొద్దిమంది ముఖాలలో నిరాశ. ఒకరి ఇద్దరు ముఖాలలో కోపం, చిరాకు కనిపిస్తున్నాయి.

జనంలో, ఆనంద తరంగాలు ఉన్నాయి. బద్దలవడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతాలు ఉన్నాయి.

స్వామివారు అందరివంక ఒక్కసారి కలయజూసారు.

సద్దుమణిగింది. సందడి తగ్గింది. శ్రద్ధా, నిశ్శబ్దం ఆ సభామండలిని ఆవరించాయి - స్వామివారి అనుగ్రహ భాషణం సాగింది.

"భగవంతుడిని గురించి భక్తులు ఎన్నో పనులు చేస్తూ ఉంటారు. ఆశ్రమాలకు, స్వామీజీలకు అంతస్థుకు మించిన కానుకలు ఇస్తారు. ఈ విషయం ఎవరూ కాదనరు. భగవంతుని చేరడానికి ప్రత్యక్ష మార్గంగా భక్తులు నవవిధ భక్తులలో ఒకదానిని ఎన్నుకుని, దానిద్వారా కైవల్యాన్ని భగవదనుగ్రహాన్ని సంపాదించడం - ఇది సర్వసాధారణంగా జరిగే పని. అందులో కూడా స్వార్థం ఉంది. ప్రతిఫలాపేక్ష ఉంది. అది తప్పు పని కాదు. సకామ యజ్ఞం. కోరిక తీరడమే ఈ తపస్సుకు లక్ష్యం.

"నిస్సంగత్వం, నిర్మోహత్వంలోనే మోక్షసాధన ఉంది. అందరూ భగవంతుని గురించి [illegible]ంచేవారే. ఆయనకోసం తాపత్రయం పడేవారే! కానీ ఇంకొక తెగవారున్నారు.

వారు తమకు ముక్తి కోరరు. మోక్షం ఆశించరు. గురు అనుగ్రహం కోసం తాపత్రయపడరు. వారికి కోరికలు ఉండవు. కోరికలు లేవన్న స్పృహ కూడా ఉండదు. భక్తులకు పరమభాగవతులకు సేవచేయడమే వారి లక్ష్యం, వారి సాధన. సర్వసామాన్యమైన ఉపాసనకు, అనుష్ఠానాలకు - గురు ఉపదేశాలకు అనుగ్రహాలకు వీరు అతీతులు.

"మాబోంట్లకు వారి దర్శనమే కనువిప్పు, జ్ఞానోదయం. ఈ వేదిక మీద ఉన్న ముగ్గురూ మాకు ఆదర్శనీయులు, ప్రాతఃస్మరణీయులు!

"ఎందరో భక్తులు మన ఆశ్రమానికి చాలా దూరప్రాంతాలనుంచి వస్తూ ఉంటారు. గంటలతరబడి క్యూలో, ఎండలో నిలబడవలసి వస్తుంది. బాధపడుతూ ఉంటారు. వారికి నీడగా ఉండటం కోసం పందిరులు వేయించి వారికి నీడ కల్పిస్తున్న వ్యక్తి శ్రీ శ్రీనివాసరావుగారు. భక్తులకు సేవ చేయడమే ఆయన లక్ష్యం. లక్షలు ఉన్నవారు కూడా చేయని ఈ పనిని సర్వ సామాన్యులైన వీరు చేయడం మన పీఠంలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి కన్నులపడ్డది. వారిని సత్కరించమని మమ్మల్ని ఆదేశించింది. ఆ అవకాశం నాకు కల్పించిన ఆ జగదంబకు సహస్ర వందనాలు చేస్తున్నాను!

"బిడ్డ ఆకలి తల్లికే తెలుస్తుంది. ఆ తల్లి దర్శనం కోసం గంటలుగా ఎదురు చూసే బిడ్డలకు, పెద్దలకు, అహర్నిశలు, అయాచితంగా, ఉచితంగా, చిక్కని పాలు ఇస్తున్న ఈ పెద్దమ్మను చూస్తూ ఉంటే త్రేతాయుగంలోని కౌసల్య, ద్వాపరంలోని యశోద, కలియుగంలో ఈ రూపున నిలిచిందేమోనన్న భ్రమ కలిగింది. ఆ తల్లికి మనం ఏమి ఇచ్చి, మనందరి ఋణం తీర్చుకోగలము? అన్న ప్రశ్న వచ్చింది.

"మేము ఆమెకు మాతృవందనం చేస్తున్నాము.

"ఇక్కడ ఇంత ఉత్సవం జరుగుతున్నా తనకు సంబంధించనట్టుగ నుంచున్న ఈ కుర్రవాడు మంచి డాక్టరు. శరీరాన్నే కాదు, మనసుకి వచ్చిన రోగాలను నిర్మూలించగల దిట్ట! అతనికున్న శాస్త్ర పరిజ్ఞానానికి, నేర్పుకి లక్షలమీద రాబడి పొందవచ్చు. మేడలు, మిద్దెలు కట్టవచ్చు. రోగి ఇచ్చింది పుచ్చుకోవటమే కానీ, ఇంత ఇస్తే కానీ వైద్యం చెయ్యను అనే తత్త్వం కాదు.

"వైద్యుడే కాదు. మంచి దైవభక్తి ఉంది. ఆధ్యాత్మిక చింతన ఉంది. జ్యోతిష్యశాస్త్రంలో ఘనమైన అనుభవం ఉంది. అన్నింటికన్నా ముఖ్యం - ఇతరులకి సేవ చేయాలనే తత్పరత ఉంది! మన ఆశ్రమంలో జరిగే అన్ని ఉత్సవాలకి వస్తాడు. రాగానే ఒక్క క్షణం మా కంట పడతాడు. వెళ్లేటప్పుడు దూరంనుంచే నమస్కారం పెడతాడు. వచ్చిన దగ్గరనుంచి వెళ్లేదాకా మన ఆసుపత్రిలో ఇరవై నాలుగు గంటలు శ్రద్ధగా సేవ చేస్తూ ఉంటాడు. అతని హస్తవాసి, మంచి మనసు ఎందరో వ్యాధిగ్రస్తులను ఆరోగ్యవంతులను చేసింది. మానవ సేవే అతని తపస్సు. వారికి తన సేవ చాలదేమోననే ఆందోళన.

"ఈ త్రిమూర్తుల దగ్గర మేము ఎన్నో విషయాలు తెలుసుకున్నాము. వారి వలన ఎంతో లబ్ది పొందాము. ఎంతో నేర్చుకున్నాము. ఒక్క మాటలో చెప్పాలంటే వారికి మేము శిష్యులమయ్యాము సేవలో. వారు మాకు గురువులయ్యారు.

"ఈనాటి ఈ సత్కారం వారికి మా గురుదక్షిణ!" అంటూ స్వాములవారు ముగ్గురి వంక వినయంగా చూసి, ఒక్క క్షణం నతమస్తకులయ్యారు. మరుక్షణం వారిని మనసారా దీవించారు.

సభ ముగిసింది. అందరూ తరలిపోయారు. ఆ ముగ్గురూ స్వాములవారి సమక్షంలో మిగిలారు.

స్వాములవారు చిరునవ్వుగా అడిగారు - "విషయం ఏమిటి?"

'విదురుడు' ముందుకు వచ్చాడు.

చిన్న మనవి అన్నాడు. తమకు ఇచ్చిన బహుమతులు ఆయన పాదాల చెంత ఉంచాడు.

"ఏమిటీ?"

"ఈ బహుమతులు, ఈ సన్మానాలు భక్తులమధ్య తరతమ భేదాలు సృష్టిస్తాయి. ద్వేషాన్ని, అసూయని పెంచుతున్నాయి. కొద్దిమందికి సంతృప్తి కలిగినా, అహంభావాన్ని సృష్టిస్తున్నాయి.చాలామందికి నిరాశ కలిగిస్తున్నాయి. శిష్యులలో సమదృష్టి పెంచండి. పరంమీదకు మసలుతున్న భక్తులను బహుమతులతో ఇహంమీదకు మరల్చడం జరుగుతోంది!" అని అంటూ నమస్కరించాడు.

స్వాములవారు చిరునవ్వుతో సమాధానం చెప్పారు "ప్రమాదో ధీమతామపి!"

# అమృత మథనం

నాలుగు దశాబ్దాలుగా అన్యోన్యంగా, మమేకంగా ఉన్న ఆ ఆదర్శదంపతులు - సోమయాజులుగారు, సోమిదేవమ్మగారు. వాక్కు... అర్ధంలా, పార్వతీ పరమేశ్వరులుగా - ఆ వాడకే కాదు, ఆ పరగణాకే శిరోభూషణంగా ఉన్న ఆ ఆది దంపతులమధ్య ఈనాడు ఎందుకనో అగ్నిపర్వతం బద్దలై సంసారం షష్టాష్టకమైపోయింది.

"ఈ విషయం ఈనాడు తేలిపోవలసిందే!" అంటూ కట్టుకున్నవాడిని నిలవేసింది.

నిత్యం ముగ్ధమనోహరంగా. స్నిగ్ధ మధురంగా ఉండే ఆ సౌజన్య రాసి వంక కొంటెగా చూస్తూ "మహిషాసురమర్దననివి కావటానికి ఇవి శరత్ నవరాత్రులు కాదు, శ్రావణమాసం - సుమంగళులు సంతోషంగా ఉండేమాసం!" అని అంటూంటే -

"ఈ మాటలతోనే అందరినీ మోసం చేస్తున్నారు!" అని ఆవిడ కోపంగానే అంది.

ఆయన ముఖంలో క్షణకాలం కోపంతో కూడిన చిరాకు కనిపించింది. భ్రుకుటి ముడిపడింది. 'మామకూతురూ! వాచాలత ఎవరికీ రాణించదు' అని అన్నారు.

ఆవిడ మాట్లాడలేదు.

'ఈ అకారణకోపానికి కారణం తెలుసుకోవచ్చా?"

"మీరే ఆలోచించుకోండి, మీకే తెలుస్తుంది నేనేమన్నా మాట్లాడితే వాచాలత